సాక్షి
నారాయణపేట
శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



పారదర్శకంగా.. వేగవంతంగా
సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా అవుతున్నాయి.

వివరాలు 8లో ▶



నేటి నుంచి బావాజీ ఉత్సవాలు
గిరిజనుల ఆరాధ్య దైవం బావాజీ జయంతి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు.

వివరాలు 8లో ▶

గరిష్టం/కనిష్టం
40.1 /21.7

వాతావరణం
ఉదయం నుంచే ఎండ ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. ఆకాశం స్వల్పంగా మేఘావృతమవుతుంది.

వస్తున్నాం.. లింగమయ్య

నేటి నుంచి సలేశ్వరం జాతర

- తెలంగాణ అమర్‌నాథ్ సాహసయాత్రగా గుర్తింపు
- మూడు రోజుల పాటు లింగమయ్య దర్శనం
- ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకే అనుమతి
- వివిధ శాఖల ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాల కల్పన



అచ్చంపేట: నల్లమలలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వు కోర్ ఏరియాలో కొలువుదీరిన సలేశ్వరం ఉత్సవాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. దట్టమైన నల్లమల అటవీ ప్రాంతం పులులు, వన్య ప్రాణుల రక్షిత ప్రాంతం కావడంతో అటవీశాఖ నిబంధనల మేరకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే వాహనాల అనుమతించనుంది. లింగమయ్య దర్శనానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది ప్రజలు తరలివస్తారు. దర్శనానికి వచ్చే భక్తులు 'వస్తున్నాం.. లింగమయ్య' అంటూ.. తిరిగి వెళ్లే స మయంలో 'వెళ్తున్నాం.. లింగమయ్య..'అనే నినాదాలతో అడవి పులకించనున్నది. ఎత్తైన కొండలు, లోయలు, సెలయేళ్లు, రాళ్లు, రప్పలు దాటుతూ.. ముందుకు సాగడం మధురానుభూతినిస్తుంది. మన్ననూర్ నుంచి సలేశ్వరం వరకు పోలీస్‌శాఖ భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసింది. వాహనదారులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అటవీమార్గంలో వాహనాల మళ్లింపునకు ఏర్పాట్లు చేస్తోంది. భక్తులు తొక్కిసలాటకు గురికాకుండా గుండం వద్ద క్రమపద్ధతిలో స్నానాలు ఆచరించేలా ఏర్పాట్లు చేశారు.

పుల్లాయిపల్లి వరకే బస్సులు

సలేశ్వరం ఉత్సవాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను పుల్లాయిపల్లి వరకు నడిపించనుంది. పుల్లాయిపల్లి నుంచి మోకాళ్ల కుర్వు చేరుకునేందుకు 50 ఆటోలు అందుబాటులో ఉంచారు. రాంపూర్ వరకు ఉన్న రోడ్డు పరిస్థితి, వర్షం పడితే కలిగే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా పుల్లాయిపల్లి వరకు బస్సులను అనుమతిస్తున్నారు. 20 నిమిషాలకు ఒకటి చొప్పున బస్సులు అందుబాటులో ఉంటాయి. శుక్రవారం అచ్చంపేట డిపో నుంచి 12, నాగర్‌కర్నూల్ 10 చొప్పున బస్సులు నడిపిస్తారు. శనివారం ప్రయాణికులను బట్టి బస్సుల సంఖ్య పెంచుతారు. అలాగే కల్వకుర్తి, వనపర్తి, నారాయణపేట, మహబూబ్‌నగర్, గద్వాల, దేవరకొండ, మిర్యాలగూడ, నల్లగొండ డిపోల నుంచి సైతం ప్రత్యే బస్సు సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బస్సులు అందుబాటులో ఉంటాయని ఆర్ఎం సంతోష్‌కుమార్ తెలిపారు.



సలేశ్వరం వెళ్లే మార్గాలు..

సలేశ్వరం లింగమయ్య దర్శనం చేసుకోవాలంటే హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిలో మన్ననూర్ తర్వాత వచ్చే ఫర్హాబాద్ చౌరస్తాకు చేరుకోవాల్సి ఉంటుంది. శ్రీశైలం నుంచి వచ్చేవారు దోమలపెంట, వటువర్లపల్లి మీదుగా ఫర్హాబాద్ చౌరస్తాకు రావాలి. అక్కడి నుంచి 25 కి.మీ., అటవీ ప్రాంతంలో ఉన్న రాంపూర్ పెంటకు, అక్కడి నుంచి మరో 6 కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్తే స్వామివారి దర్శనభాగ్యం కలుగుతుంది. ఇదే కాకుండా బల్మూర్, లింగాల–అప్పాయిపల్లి మీదుగా మరో మార్గం ఉంది. అయితే అతికష్టం మీద సంగడిగుండాల వరకు ట్రాక్టర్ల ద్వారా వెళ్లాలి. కానీ, ఈ మార్గంలో భక్తులందరూ కాలినడకనే వెళ్తుంటారు.

నిరంతర పర్యవేక్షణ

పోలీస్, అటవీ, పంచాయతీరాజ్ శాఖలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టింది. సీసీ, ట్రాప్ కెమెరాల ద్వారా అడవి మార్గంలో నిరంతర పర్యవేక్షణ చేసేలా ఏర్పాట్లు చేశారు. ఫర్హాబాద్– రాంపూర్– సలేశ్వరం క్షేత్రం వరకు డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు బందోబస్తు కల్పిస్తున్నారు. ఫర్హాబాద్ చౌరస్తా నుంచి అటవీ పరిసర ప్రాంతాల్లో అక్కడక్కడ పోలీస్ కంట్రోల్ రూంలు (టెంట్లు) ఏర్పాటు చేస్తున్నారు.

వివిధ శాఖల ఆధ్వర్యంలో..

చెంచుల ఆరాధ్యదైవం సలేశ్వరం లింగమయ్య జాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ముందుస్తు ఏర్పాట్లు చేసింది. భక్తులకు కావాల్సిన సదుపాయాలు, వసతులు కల్పించేందుకు ఆయా ప్రభుత్వ శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈసారి కలెక్టర్ బదావత్ సంతోష్ సలేశ్వరం జాతర నోడల్ అధికారిగా అచ్చంపేట ఆర్డీఓ మాధవిని నియమించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో భక్తులకు తాగునీటి వసతి, జాతరలో ప్రాథమిక చికిత్స అందించేందుకు పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఆర్టీటీ స్వచ్ఛంద సంస్థ, వనవాసి కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

- అపరిశుభ్రత లేకుండా జిల్లా పంచాయతీశాఖ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు చేసేందుకు అప్పాయిపల్లి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు బాధ్యత అప్పగించారు.
- అటవీశాఖ ఆధ్వర్యంలో రాంపూర్ చెంచుపెంట వరకు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా రోడ్డుపై మట్టి చల్లి మరమ్మతు చేపట్టారు.
- ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా అగ్నిమాపక సిబ్బందితోపాటు ఫైరింజన్ అందుబాటులో ఉంచారు. జాతరలో సోలార్ లైట్లతో విద్యుత్ వెలుగులు కల్పించారు.
- ఫర్హాబాద్ చెక్‌పోస్టు, పుల్లాయిపల్లి బేస్‌క్యాంపు, రాంపూర్ పెంట, మోకాళ్లకుర్వు (సలేశ్వరం), లింగాల మండలం అప్పాయిపల్లి, గిరిజగుండాల వద్ద 5 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకులు, చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. మూడురోజులపాటు తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హేమలత తెలిపారు.
- సలేశ్వరం వచ్చే భక్తుల కోసం రాంపూర్ చెంచు పెంటకు రెండు కి.మీ., దూరంలో మోకాళ్ల కుర్వు, అప్పాయిపల్లి మార్గంలోని గిరిజనగుండాల వద్ద దాతలు, స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు, ఉచిత అన్నదాన సత్రాలు, పండ్ల పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అల్పాహారం మొదలుకొని మధ్యాహ్నం, రాత్రి సమయంలో భోజనాలు, రాగి అంబలి, మజ్జిగ, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నారు.

న్యూస్‌రీల్

రాజీమార్గంతో కేసుల పరిష్కారం

నారాయణపేట: రాజీమార్గంతో కేసులు పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ రఫీ సూచించారు. గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కోఆర్డినేషన్ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ కార్యదర్శి వింధ్య నాయక్ మాట్లాడుతూ.. మే 10న జరగాల్సిన లోక్ అదాలత్ జూన్ 14న నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 14 పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులను అడిగి తెలుసుకున్నారు. వాటిని ఈ లోక్ అదాలత్‌లో త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. ఎక్సైజ్, ఇతర కేసులను అన్ని కలిపి 6400 కేసులను లక్ష్యంగా నిర్దేశించారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి అన్ని టీములు సిద్ధంగా ఉండాలని ఈ లోక్ అదాలత్‌ను కక్షిదారులు ఉపయోగించుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు యధావిధిగా కొనసాగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏజెండా లోని అంశాలను నాన్ -బైలాల్ వారెంట్ కేసులను, చార్జిషీట్, పిడి యాక్ట్ పెండింగ్ లో ఉన్నాయా చర్చించారు. ముందుగా హై కోర్ట్ జుడిషియల్ ఆదేశానుసారం జైలులో ఉన్న ఖైదీల కేసులను డిస్పోసల్ చెయ్యాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ సురేష్ కుమార్, బాలప్ప, డిఫెన్స్ కౌన్సిల్స్ కె లక్ష్మపతి గౌడ్, నాగేశ్వరి, డీఎస్పీ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్‌గా రాజేశ్వర్‌గౌడ్



నారాయణపేట: కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్‌గా రాజేశ్వర్ గౌడ్ నియమిస్తూ టీపీసీసీన లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆర్డర్ కాపీని డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి గురువారం రాజేశ్వర్‌గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి బాధ్యతలు ఇచ్చిన లిగల్‌సెల్ రాష్ట్ర చైర్మన్‌కు, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డితో పాటు రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలుచిట్టెం పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పీయూలో తరగతుల బహిష్కరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉన్నత విద్యా మండలి కార్యాలయం ముట్టడికి వెళ్లిన అధ్యాపకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ పాలమూరు యూనివర్సిటీలో కాంట్రాక్టు ఉద్యోగులు తరగతుల బహిష్కరించారు. ఈ సందర్భంగా భూమయ్య, రవికుమార్ మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన చేపట్టిన అధ్యాపకులను పోలీసులు అరెస్టు చేయడం ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

కదలిక వచ్చేనా..?



ర్యాలంపాడు జలాశయంలోని నాలుగు వెంట్‌లలో అడుగు భాగాన లీకేజీలు ఏర్పడింది ఇక్కడే..

- 'ర్యాలంపాడు' లీకేజీలను పరిశీలించిన నిపుణుల బృందం
- సమగ్ర వివరాలు సేకరణ
- నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిధులు విడుదల చేసే అవకాశం
- జలాశయానికి కుడి, ఎడమ అడుగు భాగాలు, రాక్‌టోల్ ప్రాంతాల్లో పలుచోట్ల లీకేజీల గుర్తింపు
- మరమ్మతులకు రూ.137 కోట్ల అంచనా నివేదిక

గద్వాల: వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో రూ.వేల కోట్లతో చేపట్టిన ఇరిగేషన్ ప్రాజెక్టులు కొందరు కాంట్రాక్టర్ల స్వార్థం.. అధికారుల అవినీతి మూలంగా వాటి ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. నడిగడ్డ ప్రాంతంలో 2లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించాలని నిర్మించిన నెట్టెంపాడు ప్రాజెక్టులో ర్యాలంపాడు జలాశయం గుండెకాయ లాంటిది. నెట్టెంపాడు ప్రాజెక్టులో ఏడు జలాశయాలు నిర్మించారు. ఇందులో సంగాల, చిన్నోనిపల్లి జలాశయాలు స్టాండ్‌బై కింద కేవలం నీటిని నిల్వ చేసుకునేందుకు నిర్మించగా, మరో 5 జలాశయాలు ఆయకట్టుకు నీరు పారించేలా నిర్మించారు. ఇందులో ర్యాలంపాడు జలాశయం కింద 1.05 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4టీఎంసీలుగా నిర్మాణం చేశారు. ఈ జలాశయం ద్వారా, ధరూరు, కేటీదొడ్డి, మల్దకల్ మండలాల పరిధిలో ఆయకట్టుకు సాగునీరు పారుతుండగా మరోవైపు 2.80టీఎంసీల సామర్థ్యంతో 1.36 లక్షల ఎకరాలకు సాగునీరు పారించేలా రూ.580కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న గట్టు ఎత్తిపోతలకు కూడా అవసరమైన 2.80టీఎంసీల నీటిని ర్యాలంపాడు జలాశయం నుంచే ఎత్తిపోసేలా నిర్మాణం చేపట్టారు.

2022లో లీకేజీల గుర్తింపు

2021 ర్యాలంపాడు జలాశయం పూర్తయి అందుబాటులోకి వచ్చింది. ఇంతటి ప్రాధాన్యత, ప్రత్యేకత ఉన్న ర్యాలంపాడు జలాశయం అడుగు భాగాన రాక్‌టోల్ నుంచి పలుచోట్ల లీకేజీలు ఏర్పడి నీరు బయటకు ఉబికి వచ్చింది. 2022లో లీకేజీలను ఇరిగేషన్ శాఖ అధికారులు గుర్తించారు. తరువాత సీఈ స్థాయిలో నిపుణుల కమిటీ జలాశయాన్ని సందర్శించి ఎక్కడెక్కడా లీకేజీలు ఏర్పడ్డాయి. అందుకు గల కారణాలు తెలుసుకుని, మరమ్మతులు చేసేందుకు ప్రత్యేకంగా అదే ఏడాది హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థకు సర్వే పనులు అప్పగించింది. ఇందుకోసం రూ.57కోట్లు వెచ్చించింది. పనులు దక్కించుకున్న సదరు సంస్థ 2022 మార్చిలో సర్వే ప్రారంభించి 2023 జనవరిలో సర్వే పూర్తి చేసింది. ఈ మేరకు లీకేజీల మరమ్మతుకు సుమారు రూ.137 కోట్లు వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించి తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదిక ప్రభుత్వానికి చేరి రెండేళ్లు గడచిపోయింది. అయినా కన్నెత్తి చూసే పాలకులు కరువయ్యారు.

- ఇదిలా ఉండగానే ర్యాలంపాడు లీకేజీలపై నివేదిక ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉండగానే గురువారం ఇరిగేషన్ శాఖకు చెందిన నిపుణుల కమిటీ ఇంజినీర్ల బృందం ర్యాలంపాడు జలాశయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు జలాశయం మొత్తం కలియ తిరిగారు. ఎడమ, కుడి వైపునున్న వెంట్లు, ఆనకట్ట అడుగుభాగాన ఉన్న లీకేజీల ప్రాంతాలను పరిశీలించారు.

మరమ్మతు చేయాలి



ర్యాలంపాడు రిజర్వాయర్ కింద మాకు ఏడెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఏటా వరిపంట సాగుచేస్తాను. ర్యాలంపాడు రిజర్వాయర్‌కు లీకేజీలు ఏర్పడడంతో రిజర్వాయర్‌లో సగానికే నీటిని నింపుతున్నారు. దీంతో తమ పంటలకు పూర్తిగా నీరు అందడంలేదు. రెండేళ్లుగా ఖరీఫ్ సీజన్‌లో వారబంధి విధానంతో నీటిని వదిలారు. పంటలకు పూర్తిగా నీరు పారక ఇబ్బందిపడ్డాను. ఈసారైన రిజర్వాయర్‌కు రిపేర్లు చేయాలి.

– రాముడు, రైతు దోర్నాల, ధరూరు మండలం

పంటలకు నీరు అందించాలి



రిజర్వాయర్ కింద 4ఎకరాల భూమి ఉంది. ఇందులో రెండెకరాలలో వరి, మరో రెండెకరాలలో పత్తిపంటను పండిస్తాం. ర్యాలంపాడు రిజర్వాయర్‌కు లీకేజీలు పడి రిపేర్లు చేయకపోవడంతో మూడేళ్లుగా ఒక్క పంటనే పండించుకుంటున్నాను. కొత్త ప్రభుత్వమైనా స్పందించి త్వరగా రిపేర్లు చేసి తమ పంటలకు నీరు అందించి ఆదుకోవాలి.

– తాయప్ప, రైతు, కేటీదొడ్డి

నిధులు విడుదల చేస్తేనే..

మరమ్మత్తులకు సంబంధించి నివేదిక హైదరాబాదులోని సీఈ కార్యాలయం టెక్నికల్ విభాగం పరిశీలనలో ఉంది. దీనిపై తుది నిర్ణయం వెలువడి, నిధులు విడుదల చేస్తే వెంటనే పనులు ప్రారంభిస్తాం. అప్పటి వరకు జలాశయం రక్షణలో భాగంగా సగానికే నీటిని నిల్వ చేస్తాం.

– రహీముద్దీన్, ఎస్ఈ ఇరిగేషన్‌శాఖ

'పేట' అభివృద్ధి మాటేమిటి..?



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: ఎన్నికల ముందు నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాలు రెండు కళ్లలాంటివని, ఇప్పుడేమో నిధులన్నీ కొడంగల్‌కు తరలిస్తున్నారని, నారాయణపేట అభివృద్ధి మాటేమిటని సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ కళాశాల రెండో సంవత్సరం తరగతులు ప్రారంభిస్తున్నా భవనం నిర్మాణం ప్రారంభించలేదని, కలెక్టరేట్ నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయని, ఎస్పీ కార్యాలయానికి పునాదే పడలేదని అన్నారు. మరో వైపు కొడంగల్ నియోజకవర్గ చివరి వరకు డబుల్ రోడ్డు వేస్తున్నారని అన్నారు. అధికారంలో ఉన్నా...లేకున్నా తెలంగాణ ప్రజల బాగోగుల కోసం పోరాటం చేసే బాధ్యత బీఆర్ఎస్ కార్యకర్తలపై ఉందన్నారు. లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించాలంటే కాంగ్రెస్ పార్టీ భయపడుతున్నదని అన్నారు. 25 వసంతలు పూర్తిచేసుకొని ఈ నెల 27న వరంగల్ నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవాలకు భారీ ఎత్తున కార్యకర్తలు తరలిరావాలనిపిలుపునిచ్చారు. ఈ నెల 27న ప్రతి గ్రామంలో గ్రామ అధ్యక్షులు, మండల కేంద్రాల్లో మండల అధ్యక్షులు, జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుల చేతుల మీదుగా పార్టీ జెండాను ఆవిష్కరించాలన్నారు. అమ్మకోళ్ల శ్రీనివాస్ రెడ్డి, కానుకుర్తి వెంకట్‌రెడ్డి,వేపూరి రాములు, విజయ్‌సాగర్ పాల్గొన్నారు.



కదిలిన రాములోరి రథచక్రాలు

- అంగరంగ వైభవంగా పెద్ద తేరు మహోత్సవం
- జనసంద్రమైన సిర్సనగండ్ల
- మార్మోగిన శ్రీరామ నామం

వివరాలు 8లో ▶

రాజీవ్ యువ వికాసంపై అవగాహన కల్పించండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: రాజీవ్ యువ వికాస పథకానికి వీలైనంత ఎక్కువమంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్ లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్ సంబంధిత శాఖల అధికారులతో రాజీవ్ యువ వికాసం, ఎన్ఆర్ఈజీఎస్, యూనిఫామ్ కుట్టు పని, లోగోస్ డాటా ఎంట్రీ, జీవిత భాగస్వామి పెన్షన్లు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర వెనకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదిగేందుకు ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు ద్వారా జిల్లాలో నిరుద్యోగం తగ్గుతుందన్నారు. అర్హులైన వారు ఏప్రిల్ 14, 2025 లోపు దరఖాస్తు చేసుకునే విధంగా అధికారులు నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ క్రింద టార్గెట్ పూర్తి చేయాలన్నారు. ఉదయం ఏడు గంటలకు ఫీల్డ్ లోకి వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. వరి ధాన్యం తడవకుండా చూడాలని టార్పాలిన్లు సిద్ధం చేయాలన్నారు. లేబర్‌ను ఎక్కువగా ఏర్పాటు చేసి ఎఫ్‌టిఓ జనరేట్ చేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామాలలో తాగునీటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఓ మొగులప్ప, అధికారులు అబ్దుల్ ఖలీల్, రషీద్ పాల్గొన్నారు.

పోషకాహార ప్రాముఖ్యతను వివరించాలి

పోషకాహార ప్రాముఖ్యతపై ఈనెల 22 వరకు నిర్వహించనున్న పోషణా పక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు.కలెక్టరేట్‌లో జిల్లా పోషణ పక్షం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 8 నుండి 22 వరకు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రం, ప్రాజెక్ట్‌ల పరిధిలో జిల్లా స్థాయిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. 704 అంగన్ వాడీ కేంద్రాలలో 6 సంవత్సరాల లోపు చిన్నారులతో పాటు, గర్భిణులు, బాలింతలలో పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించి అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం ఇతర సేవలను పూర్తిగా వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



బంక్ బెడ్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, చిత్రంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవలు ఎంతో అభినందనీయమని కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి, ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. గురువారం బాలాజీ గోల్డ్–సిల్వర్ ప్రయివేట్ లిమిటెడ్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటి, లయన్స్ లైఫ్ చారిట్రబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ మాజీగవర్నర్ సరిత హరినారాయణ్ బట్టడ్ నేతృత్వంలో పట్టణంలోని ఎర్రగుట్ట వద్దనున్న కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థినులకు రూ.5లక్షల విలువ గల బెంకర్ బెడ్స్‌ను అందజేశారు. ఈకార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం పట్టణంలోని మహంకాళి వీధిలో గల హరినారాయణ బట్టడ్ నివాసంలో రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ సభ్యులు సేవా దృక్పథంతో ఏర్పాటు చేసే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేజీబీవీ విద్యార్థినులకు బంకర్ బెడ్స్ ఇచ్చిన క్లబ్ సభ్యులను కలెక్టర్ అభినందించారు. రూ.7.50లక్షల అధునాతన అంబులెన్స్ వాహనాన్ని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, ఎస్పీ యోగేష్ గౌతమ్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, కుంభం శివకుమార్ రెడ్డి, బాలాజీ గోల్డ్ మేనేజింగ్ డైరెక్టర్ బబితా సాకేత్‌బట్టడ్, సురేష్ జగ్గనానీ, ఎంవి చారి రమేష్ చంద్రబాబు, శక్తి పీఠం వ్యవస్థపకుడు డాక్టర్ శాంతానంద్‌స్వామి పాల్గొన్నారు.

ఈ ఫైలింగ్‌పై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎన్ఐసీఎంఈఐటీ శిక్షకులు

నారాయణపేట: ఈ ఫైలింగ్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ బెన్‌షాలం తెలిపారు. గురువారం అధికారులకు కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ఈ ఆఫీస్‌పై శిక్షణ జరిగింది. నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఈ ఆఫీస్ ఫైలింగ్ విధానంపై సంస్థ తరఫున శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్, జిల్లాలోని అన్ని శాఖల సాంకేతిక సిబ్బంది సూపరింటెండెంట్లు సెక్షన్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కదిలిన రాములోరి రథచక్రాలు

- అంగరంగ వైభవంగా పెద్ద తేరు మహోత్సవం
- జనసంద్రమైన సిర్సనగండ్ల
- మార్మోగిన శ్రీరామ నామం



స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు



రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు

చారకొండ: వేదపండితుల మంత్రోచ్ఛరణాలు.. భక్తుల జయజయ ధ్వానాల మధ్య అపర భద్రాద్రి సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి రథ చక్రాలు ముందుకు కదిలాయి. శ్రీరామ నవమిని పురస్కరించుకొని నిర్వహించిన బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనాసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం తెల్లవారుజామున నిర్వహించిన రథోత్సవం (పెద్ద తేరు) కనుల పండువగా సాగింది. రంగురంగుల పూలతో శోభాయమానంగా అలంకరించిన రథంపై సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలను ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ రామశర్మ, ఈఓ ఆంజనేయులు రథాన్ని లాగి ప్రారంభించారు. ప్రధాన ఆలయం నుంచి ముక్కిండి పోచమ్మ, దత్తాత్రేయ మందిరం వరకు లాగి తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. పెద్ద తేరు వేడుక అర్ధరాత్రి 2 నుంచి ఉదయం 6 గంటల వరకు చూడముచ్చటగా సాగగా.. ఆలయ ప్రాంగణం శ్రీరామ నామంతో మార్మోగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు జనసంద్రంగా మారాయి. రథోత్సవంలో కళాకారుల కోలాటాలు, ఆటపాటలు అలరించారు. రాత్రికి స్వామివారికి నాగబలి, పూర్ణాహుతి, గజవాహన సేవ, దీపోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తామని చైర్మన్, ఈఓ తెలిపారు.

■ స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు బారులుదీరారు. స్వామివారి దర్శనం అనంతరం అమ్మవారు, శివదత్తాత్రేయ ఆలయాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు కుటుంబ సమేతంగా తరలి వచ్చి జాతరలో ఉత్సాహంగా గడిపారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ శంషోద్దీన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నిరంజన్, అర్చకులు మురళీధర్‌శర్మ, లక్ష్మణ్, కోదండరామ, వేణు, రఘు, ప్రవీణ్, సీతారామశర్మ, భక్తులు పాల్గొన్నారు.

పారదర్శకంగా.. వేగవంతంగా

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలు ప్రారంభం
- పైలెట్ ప్రాజెక్టు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లో అమలు
- మొదటిరోజు అంతంత మాత్రమే స్పందన
- మహబూబ్‌నగర్‌లో ప్రక్రియను పరిశీలించిన జిల్లా అధికారి



స్లాట్ బుకింగ్ ద్వారా జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ రవీందర్

మెట్టుగడ్డ: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రజలకు మరింత సులువుగా, వేగవంతంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 19 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలు ప్రారంభించగా.. పైలెట్ ప్రాజెక్టు కింద ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సేవలు గురువారం ప్రారంభమయ్యాయి. అయితే ఈ నూతన విధానంపై ప్రజలకు పెద్దగా అవగాహన లేకపోవడంతో మొదటిరోజు అంతంత మాత్రంగానే స్పందన లభించింది. మహబూబ్‌నగర్ కార్యాలయంలో స్లాట్ ద్వారా 74 దస్తావేజులు, వాక్ ఇన్ ద్వారా 10, నాగర్‌కర్నూల్‌లో స్లాట్ ద్వారా 8 దస్తావేజులు మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యాయి.

స్లాట్ సేవలు పరిశీలన..

మహబూబ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రారంభమైన స్లాట్ బుకింగ్ సేవలను జిల్లా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారి రవీందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్లాట్ ద్వారా జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. స్లాట్ బుక్ చేసుకుని సమయానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, వేగవంతంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కార్యాలయంలోని సిబ్బందిని ఆదేశించారు. స్లాట్ బుకింగ్ సేవలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సబ్ రిజిస్ట్రార్‌లకు సూచించారు. స్లాట్ బుకింగ్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ జరుగుతున్నా ఆఫీసులో ఇష్టారాజ్యంగా దస్తావేజులేఖరుల దగ్గర పనిచేసేవారు, ప్రజలు గుమిగూడి ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీన్ రివర్స్..

మహబూబ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం సీన్ రివర్స్ అయ్యింది. సాధారణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల దగ్గర దస్తావేజుల రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి ఉండేది. కానీ, నూతన విధానం అమలులోకి రావడంతో.. స్లాట్ బుక్ చేసుకున్న దస్తావేజుల అమ్మకం, కొనుగోలుదారుల కోసం సుమారు గంటసేపు కార్యాలయ సిబ్బంది వేచిచూడటం గమనార్హం.

సద్వినియోగం చేసుకోవాలి..

ప్రభుత్వం తీసుకువచ్చిన స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ సేవలను గురువారం మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ కార్యాలయాల్లో అందుబాటులోకి తీసుకువచ్చాం. ప్రజలు పారదర్శకంగా, వేగంగా స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు పొందవచ్చు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. – రవీందర్, జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ అధికారి, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం



రాము (ఫైల్)

బల్మూర్: మండలంలోని కొండనాగుల గ్రామానికి చెందిన యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ముడావత్ శ్రీను కుమారుడు రాము(22) కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో ఉరేసుకున్నాడు. దీన్ని గమనించిన ఇరుగు పొరుగు వారు అతన్ని అచ్చంపేట ఆస్పత్రికి తరలించే ఏర్పాటు చేస్తుండగా మృతి చెందాడు. రాము ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చిరుతదాడిలో మేకలు మృత్యువాత



కోస్గి రూరల్: చిరుతదాడిలో మేకలు మృత్యువాత పడిన సంఘటన బుధవారం గుండుమాల్ మండలంలో చోటుచేసుకుంది. గుండుమాల్ గ్రామానికి చెందిన పాతారి వెంకటయ్య ఎప్పటిలాగే తమ వ్యవసాయపొలం దగ్గర మూడు మేకలను కట్టేసి ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం వెళ్లి చూసేసరికి రెండు చనిపోగా, మరొకటి ప్రాణపాయ స్థితిలో ఉంది. చిరుతదాడి చేసిందని ఫారెస్టు అధికారి లక్ష్మణ్‌నాయక్‌కు సమాచారం అందించగా, సంఘటనా స్థలానికి చేరుకోని పంచనామా చేశారు. మండలంలో వరుసగా చిరుతదాడి ఘటనలు జరుగుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిరుతను పట్టుకునేందుకు ఫారెస్టు అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

మరికల్‌లో ఆవుదూడ..

మరికల్: మండలంలోని పల్లెగడ్డ గ్రామంలో చిరుత దాడి చేయడంతో ఆవు మృత్యువాత పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు శ్రీరామ్ తన ఆవును పొలం వద్ద కట్టేశాడు. అర్ధరాత్రి సమయంలో చిరుత దాడి చేసి చంపినట్లు రైతు పేర్కొన్నాడు. ఈ విషయంపై ఫారెస్ట్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.



48 రోజులైనా.. దొరకని ఆచూకీ



సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి

- ఆటంకాల నడుమ కొనసాగుతున్న సహాయక చర్యలు
- వారంలో శిథిలాల తొలగింపునకు యత్నిస్తున్న సిబ్బంది

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకున్న 8 మందిలో ఇద్దరి మృతదేహాలు లభ్యం కాగా.. ఆరుగురి ఆచూకీ కోసం సహాయక సిబ్బంది 48 రోజులుగా శ్రమిస్తున్నాయి. సొరంగం లోపల 13.730 కిలోమీటరు నుంచి 13.800 కిలోమీటరు వరకు కన్వేయర్ బెల్టు పొడిగింపునకు గురువారం లోకో ట్రెయిన్‌లో కన్వేయర్ బెల్టు, ఇతర సామగ్రిని తరలించారు. అత్యంత ప్రమాదకరమైన 13.936 కిలోమీటరు ప్రదేశంలో 45 మీటర్ల వరకు కంచె నిర్మించారు. ఈ ప్రదేశంలో టీబీఎం ఎర్త్ కట్టర్ శిథిలాల కింద కూరుకుపోయింది. 13.800 మీటర్ల వద్ద సహాయక సిబ్బంది తవ్వకాలు చేపడుతున్నారు. ఇక్కడి వరకు కన్వేయర్ బెల్టు పొడిగించి మట్టి, బురద, రాళ్లు బయటకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. మట్టి, బురద తొలగించే క్రమంలో నీరు ఉబికి వస్తోంది. నిమిషానికి 10 వేల లీటర్ల నీరు వస్తుండటంతో భారీ మోటార్లతో బయటకు పంపింగ్ చేస్తున్నారు. శిథిలాల కింద టన్నుల కొద్దీ స్టీల్, కూలిన కాంక్రీట్ సెగ్మెంట్లు సహాయక చర్యలకు ఆటంకంగా మారుతున్నా.. సహాయక సిబ్బంది వాటిని అధిగమిస్తూ పనులు కొనసాగిస్తున్నారు. వారంలో శిథిలాల తొలగింపు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు.

కన్వేయర్ బెల్టు పొడిగిస్తున్నాం..

సొరంగ ప్రమాద ప్రదేశంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. గురువారం సొరంగం ఇన్‌లెట్ వద్ద జేపీ కార్యాలయంలో సహాయక చర్యల పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రమాద ప్రదేశం వరకు కన్వేయర్ బెల్టు పొడిగింపు పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు సహాయక బృందాలు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాయని చెప్పారు. నిరంతరాయంగా వస్తున్న నీటి ఊటను అత్యధిక సామర్థ్యం కలిగిన మోటార్లతో బయటకు తరలిస్తున్నామని, సహాయక బృందాలు పూర్తిస్థాయిలో సమన్వయంతో పనులు చేస్తున్నారని చెప్పారు. సమావేశంలో ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్‌కుమార్, జేపీ కంపెనీ సీనియర్ ప్రాజెక్టు ఇంజినీర్ సంజయ్‌కుమార్ సింగ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎన్డీఆర్‌ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి, దక్షిణ మధ్య రైల్వే అధికారి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

పెళ్లి ఊరేగింపులో అపశ్రుతి

కత్తితో దాడి.. 10 మందికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



తలకు గాయం

గద్వాల క్రైం: పెళ్లి కుమారుడి స్నేహితులు, డీజే నిర్వాహకుడి మధ్య జరిగిన ఘర్షణలో 10 మందికి పైగా గాయపడిన ఘటన గురువారం తెల్లవారుజామున పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. జిల్లాకేంద్రంలోని గజ్జెలమ్మవీధికి చెందిన కుర్వ రామచంద్రి, సత్యమ్మ కుమారుడు అమృత్‌కు ధరూర్ మండలం చింతరేవులకు చెందిన యువతితో బుధవారం ఉదయం పట్టణంలోని చెన్నకేశవస్వామి దేవాలయంలో జరిగింది. రాత్రి పెళ్లి కుమారుడి ఇంటి వద్ద ఊరేగింపు నిర్వహించారు. డీజే పాటలకు పెళ్లి కుమారుడి స్నేహితులు మద్యం తాగి చిందులు వేస్తూ సౌండ్ బాక్స్‌లను కిందకు నెట్టడంతో పాటు డీజే నిర్వాహకుడిపై దాడి చేశారు. దీంతో అతను తన జేబులో ఉన్న కత్తితో విచక్షణ రహితంగా దాడి చేయడంతో యువకుల తల, శరీర భాగాలకు గాయాలయ్యాయి. అక్కడున్న పలువురు వారిని నియంత్రించేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది.

డయల్ 100కు ఫిర్యాదు చేయడంతో..

స్థానికులు డయల్ 100కు ఫిర్యాదు చేయడంతో డీఎస్పీ మొగిలయ్య, సీఐ శ్రీను, గద్వాల, ధరూర్, కేటీదొడ్డి ఎస్‌ఐలు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు క్షణాల్లో స్పందించడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. ఘర్షణకు దారి తీసిన అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. దాడి జరిగిన తీరును చూసి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వస్తువులు, సామగ్రి ధ్వంసం కావడంతో అక్కడి నుంచి పరుగులు తీశారు. ఘటనపై పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ కేసు నమోదు చేసుకొని అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.

చెరువులో మృతదేహం లభ్యం



మిద్దె చిన్నరాములు (ఫైల్)

గోపాల్‌పేట: ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి చెరువులో మృతదేహం లభ్యమైన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేష్‌కుమార్ వివరాల ప్రకారం..

మండలంలోని పొలికెపాడు గ్రామానికి చెందిన జమ్మయ్య కుమారుడు మిద్దె చిన్నరాములు(45) మంగళవారం ఇంటి నుంచి పొలంవద్దకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. రాత్రి వరకు తిరిగి రాకపోయేసరికి బుధవారం కుటుంబ సభ్యులు వెతికారు. పొలానికి అనుకుని ఉన్న పెద్దచెరువు వద్ద చెప్పులు, బీడీ కట్ట ఉండటంతో బుధవారం చెరువులో వెతికారు అయినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం ఆరుగంటల ప్రాంతంలో చెరువులో మృతదేహం కనిపించగా బయటికి తీయించారు. మిద్దె చిన్నరాములుకు అప్పుడప్పుడు ఫిట్స్ వచ్చేది. చేపల కోసం చెరువులోకి దిగగా ఫిట్స్ వచ్చి మరణించాడని భార్య మంజుల ఫిర్యాదులో పేర్కొంది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అతనికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

పోక్సో కేసులో 26 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

ధన్వాడ: పోక్సో కేసులో ధన్వాడకు చెందిన టప్ప భానుకు 26 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.8 వేల జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ తీర్పునిచ్చినట్లు నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024, మార్చి 16న తమ కుమార్తెను భాను లైంగికంగా వేధించాడని ధన్వాడ పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా.. అప్పటి ఎస్‌ఐ రమేశ్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారని పేర్కొన్నారు. కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల బాలప్ప వాదనలు వినిపించారని.. నేరం రుజువు కావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శిక్ష ఖరారు చేసినట్లు చెప్పారు. అలాగే బాధితురాలికి రూ.ఐదు లక్షలు ప్రభుత్వం తరుపున పరిహారం అందజేయాలని ఆదేశించారు.

కాలిపై నుంచి వెళ్లిన బస్సు

- మహిళకు తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళ కాలిపై నుంచి బస్సు వెళ్లడంతో తీవ్ర గాయాలైన ఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం కోడేరుకు చెందిన బాలకిష్టమ్మ కూతురు వద్దకు వెళ్లేందుకు మహబూబ్‌నగర్ బస్సు ఎక్కింది. ఇదే క్రమంలో భర్త చంద్రయ్య ఆర్టీసీ బస్సులో లేకపోవడంతో గమనించి ఆమె బస్సు దిగేందుకు ప్రయత్నించగా, ఆర్టీసీ బస్సు టైరు ఆమె కాలిపై నుంచి వెళ్లడంతో కాలు పూర్తిగా విరిగిపోయింది. గమనించిన స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

బావాజీ ఉత్సవాలకు సర్వం సిద్ధం



కొత్తపల్లి మండంలోని తిమ్మారెడ్డిపల్లిపల్లిలోని గురులోకమాసంద్ ఆలయం

- నేటి నుంచి 14 వరకు ప్రత్యేక పూజాలు
- 6 రాష్ట్రాల నుంచి తరలిరానున్న గిరిజనులు
- ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా అధికారులు



గురులోకమాసంద్ సమాధి

మద్దూరు/కొత్తపల్లి: గిరిజనుల ఆరాధ్య దైవం గురులోకామాసంద్ ప్రభు(బావాజీ)జయంతి (చైత్ర శుద్ధ పౌర్ణమి) ఉత్సవాలకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. కొత్తపల్లి మండంలోని తిమ్మారెడ్డిపల్లి పల్లిలోని గురులోకామాసంద్ ప్రభు ఆలయంలో ఈనెల 11 నుంచి 14 వరకు చైత్ర శుద్ధ చతుర్దశి నుంచి చైత్ర బహుళ విదియ వరకు ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలకు కర్ణాటక, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి గిరిజన భక్తులు పెద్దఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకోనున్నారు. మొదటి రోజు ప్రభోత్సవం, బంజారాల సంస్కృతి కార్యక్రమాలు, 12న రథోత్సవం, 13న మహాభోగ్, ప్రభువారి పల్లకీసేవ, కాళికాదేవి మొక్కుల చెల్లింపు, 14న కాళికాదేవి పల్లకీ సేవ, హోమం, పూర్ణాహుతి, మంగళహారతి తదితర క్రతువులు జరిపిస్తారు.

ఏర్పాట్లు పర్యవేక్షించిన జిల్లా అధికారులు

ఉత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్‌కుమార్ బుధవారం సమీక్ష నిర్వహించగా, గురువారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి వివిధ శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణకు అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌ను నోడల్ అధికారిగా నియమించిన విషయం తెలిసిందే. నోడల్ అధికారి పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారులు ఉత్సవాల ఏర్పాట్లు చురుగ్గా నిర్వహిస్తున్నారు. పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా తదితర ఏర్పాట్ల కోసం 450 మంది సిబ్బందిని నియమించినట్లు డీపీఓ కృష్ణ తెలిపారు. జాతరను 12 సెక్టార్లుగా విభజించి ఒక్కో సెక్టార్ ఇన్‌చార్జ్‌గా ఎంపీఓ వ్యవహరించనున్నారు. ఫిర్యాదులకు 2 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు కోస్గి సీఐ సైదులు పేర్కొన్నారు. అదే విధంగా షీటీంలు, మఫ్టీలో పోలీసులు, పెట్రోలింగ్, ట్రాఫిక్, ఇతర బందోబస్తుకు పోలీసులను నియమించినట్లు ఆయన తెలిపారు. నారాయణపేట డీఎస్పీ లింగయ్య పర్యవేక్షణలో 10 సీఐలు, 15 ఎస్‌ఐలు, 36 హెడ్‌కానిస్టేబుల్స్, 150 మంది పోలీసులు, 53 మంది హోంగార్డులు విధులు నిర్వహించనున్నారు. కోస్గి, మహబూబ్‌నగర్ డిపో నుంచి అదనంగా బస్సులు నడిపిస్తామని డిపో మేనేజర్ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

రూ.6 లక్షల బంగారు, కారు స్వాధీనం



అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు

వనపర్తి/కొత్తకోట రూరల్: బంగారు షాపుల్లో నగలు కొనుగోలు చేసేందుకు వచ్చినట్టు గుంపుగా వచ్చి షాపులోని వారిని మాటల్లో పెట్టి బంగారు చోరీకి పాల్పడుతున్న దొంగల ముఠాను కొత్తకోట పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 3న కొత్తకోట పట్టణంలోని శివ హనుమాన్ జువెలర్స్‌లో మధ్యాహ్నం షాపు యజమాని లేని సమయంలో ముగ్గురు ఆడవాళ్లు ముగ్గురు చిన్నారులతో కలిసి బంగారు కొనుగోలు చేసేందుకు వచ్చారు. షాపులో పనిచేసే వాళ్లను మాటల్లో పెట్టి రూ.6లక్షల విలువ చేసే బంగారు బిస్కెట్‌ను దొంగిలించారు. షాపులోని సీసీ కెమెరాల్లో దొంగతనం జరిగినట్టు తెలుసుకుని షాపు యజమాని విశ్వమోహన్ అదేరోజు కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కొత్తకోట ఎస్‌ఐ ఆనంద్, సీఐ రాంబాబు ఆధ్వర్యంలో రెండు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి దొంగలను పట్టుకునే పనిలో పడ్డారు. గురువారం పట్టణంలో అనుమానంగా తిరుగుతున్న మహిళలను పట్టుకుని తమదైన శైలీలో విచారించగా, చేసిన దొంగతనం ఒప్పుకున్నారు. నేరస్తుల వివరాలను జిల్లా కేంద్రంలో డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు మీడియాకు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన నందకిషోర్ పవార్, రోహిత్ మచ్చీంద్ర, ఆకాష్ అంకూష్ పదుల్కర్ అలియాస్ అజయ్, సోనాలి, నిర్మలబాయితో పాటు ఇద్దరు బాలికలు ముఠాగా ఏర్పడి ఈనెల కొత్తకోటకు వచ్చి ఓ లాడ్జిలో రూంను తీసుకున్నారు. 3న ఉదయం పట్టణంలోని బంగారు షాపులను రెక్కి నిర్వహించారు. షాపులో యజమాని లేకపోవడం, పనిచేసే అబ్బాయి ఉన్నాడని చూసుకుని శివహనుమాన్ జువెలర్స్ షాపులో బంగారు కొనేందుకు వెళ్లారు. షాపులో పనిచేసే అబ్బాయికి అడ్డంగా మహిళలు నిలబడి మాటల్లో పెట్టగా షాపులోని కౌంటర్‌లో గల రూ.6లక్షల విలువ చేసే బంగారు బిస్కెట్‌ను ముఠాలోని బాలిక దొంగతనం చేసింది. పథకం ప్రకారం పని పూర్తయిందని గమనించిన ముఠా సభ్యులు బయటకు వచ్చి అక్కడి నుంచి ఆటోలో కొద్ది దూరం వెళ్లారు. ముఠాలోని మగవారు వారికోసం కారును పెట్టుకొని ఎదురు చూస్తుండగా ఆటోలో వచ్చిన ఆడవాళ్లు కారులో ఎక్కి కర్నూల్ వైపు వెళ్లిపోయారు. కేసు నమోదు చేసి త్వరగా ఛేదించినందుకు ఎస్‌ఐ ఆనంద్‌ను, పట్టుకునేందుకు బృందాలుగా ఏర్పాటు చేసిన సీఐ రాంబాబును, సీసీఎస్ ఎస్‌ఐ రామరాజు, కానిస్టేబుల్స్ యుగంధర్‌గౌడ్, సత్యనారాయణయాదవ్, మురళి, మహిళా కానిస్టేబుళ్లు ప్రవళికతో పాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. ప్రతి షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని షాపు యజమానులకు డీఎస్పీ సూచించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: కడుపునొప్పికి తాళలేక పురుగుల మందు తాగిన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన కావలి శాంతమ్మ (34) కొన్ని రోజుల నుంచి తీవ్ర కడుపునొప్పితో బాధపడుతోంది. కడుపునొప్పి తాళలేక ఈ నెల 8న వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేసింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఘటనకు సంబంధించి శాంతమ్మ తల్లి అలివేల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.